# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 15-04-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- సార్వత్రిక ఎన్నికల నేపధ్యంలో ఆంధ్రప్రదేశ్‌లో 125.97 కోట్ల రూపాయలను స్వాదీనం చేసుకున్నట్లు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా వెల్లడించారు.

- ఎన్నికలను విజయవంతంగా నిర్వహించడంలో ప్రసార మాధ్యమాల పాత్ర కీలకమని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా పేర్కొన్నారు.

- రాష్ట్రంలో అధిక ఉష్ణోగ్రతల దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆంధ్రప్రదేశ్ విపత్తు నిర్వహణ సంస్థ సూచించింది.

- శ్రీరామ నవమి వేడుకల నేపథ్యంలో అయోధ్య రామాలయాన్ని రేపటి నుంచి మూడు రోజుల పాటు 20 గంటల దర్శనాలు కల్పించనున్నారు.

==========================

సార్వత్రిక ఎన్నికల నేపధ్యంలో ఆంధ్రప్రదేశ్‌లో 125.97 కోట్ల రూపాయలను స్వాదీనం చేసుకున్నట్లు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా వెల్లడించారు. ఈరోజు అమరావతిలో పాత్రికేయులతో మాట్లాడుతూ, రాష్ట్రం నుండి లభించిన 125.97 కోట్ల రూపాయలలో 32.15 కోట్ల రూపాయల నగదు, 4.06 కోట్ల రూపాయల మాదకద్రవ్యాలు, ఇతర వస్తువులు ఉన్నాయని పేర్కొన్నారు. భారత ఎన్నికల సంఘం ఆదేశాలను అనుసరించి రాష్ట్ర ఎన్నికల కమీషన్ నేతృత్వంలో జిల్లా ఎన్నికల అధికారులు, ఎస్పీలు, ఎన్ ఫోర్స్‌మెంట్ ఏజన్సీలతో తరచుగా సమీక్షలు, సమావేశాలు నిర్వహించడం, అదే విదంగా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న చెక్ పోస్టులు, అంతర్ రాష్ట్ర చెక్ పోస్టుల్లో పటిష్టమై నిఘా వ్యవస్థను ఏర్పాటు చేయడంతో ఇది సాధ్యపడిందని అన్నారు.

==========================

ప్రజాస్వామ్యంలో మీడియాకు కీలకమైన పాత్ర ఉందని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా అన్నారు. అమలాపురం కలెక్టరేట్ లో సాధారణ ఎన్నికలకు సంబంధించి మీడియా సర్టిఫికేషన్ మీడియా కో-ఆర్డినేషన్ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సాధారణ ఎన్నికలకు సంబంధించి కేంద్ర ఎన్నికల సంఘం సూచనల మేరకు సమగ్ర సమాచారాన్ని ఎప్పటికప్పుడు ప్రసార మాధ్యమాలకు అందజేసి ప్రజలకు చేరేలా ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. జిల్లాలోని 7 అసెంబ్లీ, ఒక పార్ల మెంటు నియోజకవర్గాలకు జరిగే

ఎన్నికలను స్వేచ్ఛాయుత వాతావరణంలో విజయవంతంగా నిర్వహించడంలో ప్రసార మాధ్యమాల సహకారం ఎంతో అవసరమని ఆయన పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు రోజు రోజుకి పెరగుతున్నాయి. ఈరోజు 140 మండలాల్లో వడగాడ్పులు వీయగా, రేపు 113 మండలాల్లో వడగాడ్పులు వీచే అవకాశం ఉందని ఆంధ్రప్రదేశ్ విపత్తు నిర్వహణ సంస్థ తెలియజేసింది. కోస్తా జిల్లాల్లో మోస్తరు వేడిగాలులు వీస్తుండగా.. ఉత్తరాంధ్రలో తీవ్రంగా వీస్తున్నాయి. ఈరోజు శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, కాకినాడ, తూర్పు గోదావరి జిల్లాల్లో కొన్ని మండలాల్లో వేడిగాలులు వీచాయని విపత్తు నిర్వహణ SDMA ఎండీ రోణంకి కూర్మనాథ్ తెలిపారు. అధిక ఉష్ణోగ్రతల దృష్ట్యా ప్రజలు వీలైనంత వరకు 11 గంటల నుంచి 4 గంటల వరకు ఇంట్లో ఉండాలని.. తప్పని సరి పరిస్థితి అయితేనే బయటకు రావాలని సూచిస్తున్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

శ్రీరామ నవమి వేడుకలకు రామజన్మభూమి అయోధ్య సర్వాంగ సుందరంగా ముస్తాబవుతోంది. బాలరాముడి ప్రాణ ప్రతిష్ఠ అనంతరం తొలి శ్రీరామ నవమి కావడంతో అధికారులు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ వేడుకలకు దేశం నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉండటంతో రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ ప్రాంగణంలో అదనపు ఏర్పాట్లు చేపడుతున్నారు. అదేవిధంగా వేడుకల నేపథ్యంలో మూడు రోజుల పాటు స్వామి వారి దర్శన సమయాలను పెంచారు. రేపటి నుంచి మూడు రోజుల 20 గంటల పాటూ ఆలయాన్ని భక్తుల కోసం తెరిచి ఉంచాలని నిర్ణయించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఈరోజు రాత్రి విశాఖపట్నం రైల్వేస్టేషన్ నుంచి 7 గంటల 10 నిమిషాలకు బయలుదేరాల్సిన విశాఖపట్నం-తిరుపతి ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ 4 గంటల 20 నిమిషాలు ఆలస్యంగా, అనగా రాత్రి 11 గంటల 30 నిమిషాలకు రీషెడ్యూల్ చేసినట్లు వాల్తేర్ డివిజనల్ సీనియర్ కమర్షియల్ మేనేజర్ ఏ.కే. త్రిపాటి ఒక ప్రకటనలో తెలియజేశారు. దీని జత రైలు ఆలస్యంగా నడుస్తున్నందున ఈ మార్పు చేశామని, ప్రయాణీకులు గమనించాలని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారతీయ జనతా పార్టీ ప్రకటించిన మేనిఫెస్టో ప్రతి ఒక్కరికి యోగ్య దాయకమైనదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని బిజెపి పార్టీ కార్యాలయంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ, సంక్షేమ, పారిశ్రామిక, దేశ అభివృద్ధికై పలు పథకాలను మేనిఫెస్టోలో పొందుపరిచారని తెలిపారు. ప్రపంచంలో భారత్ మూడవ ఆర్థిక శక్తిగా ఎదగాలనే లక్ష్యంతో అన్ని అంశాలతో పాటు, 24 రంగాలు, మధ్యతరగతి, మహిళలు, యువత, వృద్ధులు, రైతులు, తదితర వర్గాలు వారి సంక్షేమాభివృద్దిని దృష్టిలో పెట్టుకొని ఈ మ్యానిఫెస్టోను రూపొందించారని ఆమె తెలియజేశారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఆంధ్రప్రదేశ్ లో ఇంటర్ అడ్వాన్స్ డ్ సప్లిమెంటరీ పరీక్షలకు సంబంధించిన ఫీజు వివరాలను ఇంటర్మీడియట్ బోర్డు ప్రకటించింది. జనరల్, ఒకేషనల్ కోర్సుల థియరీ పరీక్షలు రాయదల్చినవారు 550 రూపాయల ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. పరీక్ష ఫీజు 550 రూపాయలతో పాటు ఒక్కో పేపరుకు160 రూపాయల చొప్పున అదనంగా చెల్లించాలని బోర్డు పేర్కొంది. ఇక ప్రాక్టికల్స్ పరీక్ష ఫీజును 250 రూపాయలుగా నిర్ణయించారు. ఈ పరీక్షలకు హాజరుకావాల్సినవారు ఈనెల 18 నుంచి 24వ తేదీ వరకు పరీక్ష ఫీజు చెల్లించాలని ఇంటర్మీడియట్ విద్యామండలి పేర్కొంది. జవాబు పత్రాల

రీవెరిఫికేషన్ కు 1,300 రూపాయలను, రీకౌంటింగ్ కు 260 రూపాయలు చొప్పున చెల్లించాల్సి ఉంటుంది. ఇంటర్ అడ్వాన్స్ డ్ సప్లిమెంటరీ పరీక్షలను ఇంటర్మీడియట్ బోర్డు మే 24 నుంచి జూన్ 1 వరకూ నిర్వహించనుంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఎన్నికల ప్రచారంలో భాగంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన 'మేమంతా సిద్ధం' బస్సు యాత్ర ఈరోజు 15వ రోజు కేసరపల్లి నుండి ప్రారంభమయ్యింది. ఈ బస్సు యాత్ర గన్నవరం, ఆత్కూర్, వీరవల్లి క్రాస్, హనుమాన్ జంక్షన్, పుట్టగుంట, జొన్నపాడు, జనార్దనపురం మీదుగా సాయంత్రం గుడివాడ చేరుకుంది. గుడివాడలో జరిగే బహిరంగ సభలో జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొని ప్రసంగిస్తున్నారు. అనంతరం హనుమాన్ జంక్షన్ జాతీయ రహదారి, గుండుగొలను మీదుగా నారాయణపురం వద్ద ఏర్పాటు చేసిన రాత్రి బస శిబిరానికి జగన్‌మోహన్‌రెడ్డి చేరుకుంటారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

తొలి విడత ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తిచేసుకుని ఆర్డర్లు తీసుకున్న వారంతా ఎన్నికల విధులకు తప్పకుండా హాజరుకావాలని విశాఖ జిల్లా రెవెన్యూ అధికారి కె. మోహన్ కుమార్ స్పష్టం చేశారు. ఈరోజు కలెక్టరేట్ లో అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తొలి విడత శిక్షణకు హాజరుకాని వారు తగిన కారణాలు తెలియజేయాలని, ఎవరికీ మినహాయింపులు లేవని ఆయా విభాగాల అధికారులను ఆదేశించారు. ఓపీవోలుగా విధుల్లో నియోగించబడిన అధికారులు పోస్టల్ బ్యాలెట్ వినియోగానికి అనుగుణంగా ఫాం-12 పత్రాలు సమర్పించాల్సి ఉందని పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా విజయనగరం జిల్లా రాజాంలో నిర్వహించిన "ప్రజాగళం" బహిరంగ సభలో తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వంతో రాష్ట్రంలో యువతకు ఉద్యోగాలు లభిస్తాయని అన్నారు. తాము అధికారంలోకి వస్తే మెగా డీఎస్సీని పూర్తీ చేస్తామని హామీ ఇచ్చారు. డ్వాక్రా సంఘాల మహిళలను ఆర్థికంగా బలోపేతం చేస్తామని చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

మలేరియా ప్రభావిత గ్రామాలలో ముందస్తుగా దోమల మందు పిచికారీ పనులు చేపట్టామని అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ఎం.విజయ సునీత పేర్కొన్నారు. ఈరోజు పాడేరు మండలం ఉబ్బేటి పుట్టు గ్రామంలో దోమల మందు పిచికారీ పనులను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రణాళిక ప్రకారం నిర్దేశించిన గ్రామాలలో దోమల మందు స్ప్రే పనులు పూర్తి చేయాలని మలేరియా అధికారులను సిబ్బందిని ఆదేశించారు. మొదటి విడత కింద జిల్లా వ్యాప్తంగా 62 ప్రాధమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో 1,767 గ్రామాలలో ఈనెల 15 నుంచి 30వ తేదీ నాటికి దోమల మందు పిచికారి చేయడానికి లక్ష్యంగా నిర్దేశించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమానికి గ్రామస్తులు సహకరించాలని ఆమె కోరారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఈ నెల 18 నుంచి 25వ తేది వరకు అభ్యర్థుల నామినేషన్ల స్వీకరణ జరుగుతుందని అనంతపురం జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ తెలిపారు. ఈరోజు జిల్లా కలెక్టరేట్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఉదయం 11 గంటల నుండి 3 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ జరుగుతుందని, చివరి గడువు తేదీ రోజున 3 గంటల తర్వాత ఎటువంటి నామినేషన్ల స్వీకరించబడవని పేర్కొన్నారు.

ప్రజలు "సి విజిల్" యాప్ ను ఉపయోగించి ఫిర్యాదులు ఇవ్వొచ్చని, సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాలు పెడితే వారిపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు.

============================

విజయమే లక్ష్యంగా గ్రూప్-2 మెయిన్స్ పై ప్రత్యేక దృష్టి పెట్టాలని అల్లూరి సీతారామరాజు జిల్లా ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి వి. అభిషేక్ పిలుపునిచ్చారు. జిల్లాలోని వేపగుంట వైటీసిలో ఐటిడిఏ ఆధ్వర్యంలో 21వ సెంచరీ ఎడ్యుకేషన్ సొసైటీ అందిస్తున్న సివిల్స్ శిక్షణా కార్యక్రమాన్ని ఆయన ఈరోజు సందర్శించారు.

============================

============================